1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 5
సంచిక : 10
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

డిసెంబరు 2019







- జి.వో.నెం 81 ని వెంటనే రద్దు చెయ్యాలి. మాతృభాషా మాధ్యమాన్ని కొనసాగించాలి.
- ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల లన్నిటిలో ఎలిమెంటరీ స్థాయిలో మాతృభాషా మాధ్యమాన్ని తప్పనిసరి చెయ్యాలి.
- ప్రాథమిక స్థాయి నుండి ఇంగ్లీషును ఒక భాషగా సమర్థవంతంగా నేర్పాలి.
- అందరికీనాణ్యమైన, సమానమైన విద్యనందించే 'కామన్ స్కూల్' విధానాన్ని ప్రవేశపెట్టాలి.

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి





డిసెంబరు 2019


## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట -రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో www.ammanudi.org చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| సంపాదక హృదయం: | స్వార్థరాజకీయాలకు అమ్మభాషను బలిపెట్టవద్దు | | 07 |
| బోధనామాధ్యమం : | విద్యామాధ్యమ..... | ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు | 09 |
| బోధనామాధ్యమం : | మాతృభాషా మాధ్య... | ఆచార్య కృపాచారి గుజ్జర్లమూడి | 13 |
| బోధనామాధ్యమం : | భాషా రాజకీయాలు:.... | ఆచార్య పులికొండ సుబ్బాచారి | 16 |
| అమ్మభాషకుమరణశాసనం : | తెలుగు మాధ్యమం రద్దు... | బి.హనుమారెడ్డి | 20 |
| బోధనా మాధ్యమం : | భాషా మాధ్యమం ఎంపిక... | కృపాకర్ పొనుగోటి | 22 |
| బోధనా మాధ్యమం : | తెలుగుభాషా మాధ్యమ... | రహ్మానుద్దీన్ షేక్ | 25 |
| తిరగమోత : | ఏమిటీ పరభాషా.... | సడ్లపల్లె చిదంబర రెడ్డి | 28 |
| ముఖాముఖి | తెలుగు వికాసంపై... | డా॥ గోవిందరాజు చక్రధర్ | 29 |
| సంప్రదాయం సాధికారిత: | సాహిత్యం, శాస్త్రీయ విద్య... | డా॥ పి. శివరామకృష్ణ | 36 |
| పిట్టచూపు : | గ్రామీణ భారత్ వత్తిడికి.... | చలసాని నరేంద్ర | 46 |
| ఆదిధ్వని : | తెలంగాణా ప్రత్యేకతలు... | సన్నిధానం నరసింహశర్మ | 48 |
| పొరుగుభాషల్లోకి : | కన్నడ భాషలో... | డా॥గిన్నారపు ఆదినారాయణ | 50 |
| నవల : | జగమునేలిన తెలుగు- 4 | డి.పి.అనూరాధ | 31 |
| ధారావాహికలు : | సొతంత్రకాల సదువులు-7 | నంద్యాల నారాయణరెడ్డి | 38 |
| | జోగిని మంజమ్మ ఆత్మకథ-5 | రంగనాథ రామచంద్రరావు | 42 |
| కవితలు : | మట్టిభాష | కృపాకర్ పొనుగోటి | 24 |
| | యుద్ధం వద్దు | డా॥ ఎన్. గోపి | 30 |
| | తెలుగు రైతు | ఎస్ ఆర్ పృథ్వి | 35 |
| | మరిగి మరిగి... | నిఖిలేశ్వర్ | 45 |



| కార్టూన్లు | రేఖాచిత్రాలు | కంప్యూటరీకరణ |
|---|---|---|
| సరసి | పావులూరి చిదంబరేశ్వరరావు | లంకె జనార్దన్ |


**'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిష్టర్డ్ పోస్టులో, లేదా editorammanudi@gmail.com కు పంపించండి. - సంపాదకుడు**


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి**, జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : 0866-2439466 సంపాదకుడు : 9848016136 e-mail : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

# “తెలుగు తదితర మాతృభాషల్లో బోధనను రద్దుచేసిన జి.ఒ.81ను రద్దు చెయ్యాలి”

# మాతృభాషా మాధ్యమ వేదిక నిరసన ప్రదర్శన




ప్రజలు తమ మాతృభాష ‘తెలుగు’ ద్వారా చదువుకొనే అవకాశాన్ని పూర్తిగా లేకుండా చేస్తూ, పరాయి ఆంగ్లభాషనే మాధ్యమభాషగా తప్పనిసరి చేస్తూ నవంబరు 5న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జి.ఒ.నెం. 81ను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ – మాతృభాషా మాధ్యమ వేదిక తొలి నిరసన ప్రదర్శనను 17వ తేదీన విజయవాడలో నిర్వహించింది.

తుమ్మలపల్లి కళాక్షేత్రం వాకిలి వద్దగల తెలుగుతల్లి విగ్రహం ముందు నినాదాల అట్టలతో రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల, భాషోద్యమకారుల, రచయితల కళాకారుల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఎం.ఎల్.సి. రాము సూర్యారావు, మాజీ ఎం.ఎల్.ఎ. సుబ్బరాజు, వివిధ సంఘాల నేతలు, వేదిక బాధ్యులు ప్రసంగించారు. ‘సాహితీ స్రవంతి’ వొర ప్రసాద్ నిర్వహించారు.

అన్ని సంఘాల సమైక్య కార్యాచరణకోసం

‘మాతృభాషా మాధ్యమవేదిక’ ఏర్పడింది.

30కి పైగా ఉపాధ్యాయ, విద్యార్థి, సాంస్కృతిక, భాషోద్యమ సంఘాలతోను, ప్రముఖ వ్యక్తులు, మేధావులతోను పలు విడతలు చర్చలు జరిపిన మీదట ‘మాతృభాషా మాధ్యమ వేదిక’ ఒక సమైక్య వేదికను ఏర్పరచాలని నిర్ణయించారు. వేదిక సారధ్య సంఘ బాధ్యులుగా శ్రీ యుతులు వితపు బాలసుబ్రహ్మణ్యం, డా॥సామల రమేష్‌బాబు, డా॥ పరిమి, పెనుగొండ లక్ష్మీనారాయణ, దివికుమార్, డి.రమేష్ పట్నాయక్, వొరప్రసాద్ వ్యవహరిస్తారు.

నవంబరు 19న జరిగిన సారధ్య సంఘ సమావేశంలో – జిల్లాల బాధ్యుల్ని నిర్ణయిస్తూ తీర్మానించారు.

**డిసెంబరు 11న సత్యాగ్రహం :**

**డిసెంబరు 11న బుధవారం – మేధావులు, విద్యావేత్తలు, ప్రముఖ రచయితలతో విజయవాడలోని ధర్నాచౌక్‌లో ఉదయం 10 గం.నుండి సాయంత్రం 6 గం. వరకు సత్యాగ్రహ కార్యక్రమం మాతృభాషా మాధ్యమ వేదిక నిర్వహణలో జరుగుతుంది.**

వివరాలకు : కార్యాలయ బాధ్యులు వొర ప్రసాద్‌ను 9490099059 లో సంప్రదించండి.

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

# విద్యామాధ్యమంగా జనభాషలు

రాచరికాలు పోయి ప్రజాస్వామ్య యుగంలోకి అడుగు బెట్టామని అనుకొన్నాం. మన నేల, మన భాష, మనదే పాలన అని గుండెల మీద చేతులేసుకొని ఊపిరిపీల్చుకుందామని అనుకున్నాం. స్వాతంత్ర్యం వచ్చి డెబ్బై ఏండ్లు దాటినా ఏం సాధించామో అర్థం కాని పరిస్థితి. మనం ఈ మధ్యనే 70వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకొన్నాం. రాజ్యాంగ నిర్మాతల ఆదర్శ స్ఫూర్తితోనూ రాజ్యాంగం సాక్షిగా మన చట్టాలూ నిర్ణయాలూ జరగాలి. అలా జరగటం లేదని విద్యావిధానంలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టిన తీరు చెబుతోంది.

### మాతృభాషా విద్యావిధానం:బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలు:

భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్: రచనలూ ప్రసంగాలూ, (వాల్యూమ్ 02, పేజి 296) నుండి తీసుకున్న ఈ పంక్తులను చూడండి:

IX. స్థానిక భాషల వాడుక అనే అధ్యాయంలో, ఆయనతో ముఖాముఖిలో లేవనెత్తిన కొన్ని ప్రశ్నలూ వాటికి ఆయన ఇచ్చిన జవాబులూ (45-46, 34) ఇలా ఉన్నై.

ప్రశ్న 45. బొంబాయి విశ్వవిద్యాలయం లేక కొత్తగా ఏర్పాటు చేసిన మరేదైనా విశ్వవిద్యాలయంలో, ఇంగ్లీషు స్థానే స్థానిక భాషలను బోధనా, పరీక్షా మాధ్యమాలుగా మార్చడానికీ ఏ దశలో ఇంకా ఏ మేరకూ వాడవచ్చునంటారు? విద్యార్థులకు అవసరమైన ప్రామాణిక ఆంగ్లానికి ఆటంకం కలగకుండా అందించే దిశలో మీరు ఎలాంటి జాగరూకతా విధానాలను సూచిస్తున్నారు?

ప్రశ్న 46. ఈ ప్రెసిడెన్సీ యొక్క స్థానిక భాషల శాస్త్రీయ అధ్యయనాన్ని ప్రోత్సహించడానికి ఇంకా అన్ని రకాల మంచి భాషా సాహిత్యాల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి సర్వోత్తమమైన పద్ధతి ఏదని మీరు అంటారు?

సమాధానాలు 45-46: బోధనా మాధ్యమంగా **మాతృభాషను ఉపయోగించడంపై నేను చాలా దృఢమైన అభిప్రాయాన్ని కలిగి ఉన్నాను.** పారస్పరిక వ్యవహారం కోసం ఏ మాతృభాషను ఎంచుకోవాలో భారతీయ ప్రజాభిప్రాయం నిర్ణయిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని నేను భావిస్తున్నాను.

సమాధానం 34: **విద్యా వ్యాప్తే విశ్వవిద్యాలయ ప్రయోజనం. ఐతే ప్రస్తుత పరిస్థితులలో, బోధనా మాధ్యమంగా విశ్వవిద్యాలయం మాతృభాషను స్వీకరించితే తప్ప దీన్ని సాధించలేము.**

(Z: అంబేద్కర్ వాల్-02 వాల్2-04. indd MK SJ + YS 21-9-2013 / YS -8-11-2013.) డా. బాబాసాహెబ్ అంబేద్కర్: రచనలు మరియు ప్రసంగాలు, వాల్యూమ్ 02, పేజి 296).

అంటే మన పాలకులు ఎవరూ మన రాజ్యాంగాన్ని గానీ, డా. బాబాసాహెబ్ అంబేద్కర్: రచనలూ ప్రసంగాలనూ చదవడంగానీ వాటిని పట్టించుకుంటున్నట్లు గానీ అనిపించటం లేదు. మన విద్యావిధానం, మన దేశ ఆర్థిక స్థితికి అద్దం పడుతోంది.

### మాతృభాష మాధ్యమం గురించి మహాత్మా గాంధీ ఆలోచనలు:

**"భారతదేశాన్ని పట్టిపీడిస్తున్న మూఢనమ్మకాలలో అన్నింట్లోకెల్లా పెద్దది స్వాతంత్ర్య భావనలను అలవరచుకోడానికీ సరైన ఆలోచనలను పెంపొందించుకోడానికీ ఆంగ్ల భాషా జ్ఞానం తప్పనిసరి అనే నమ్మకమే."**

"ఈ విశ్వవిద్యాలయానికి వచ్చే యువత తమ మాతృభాష ద్వారా తమ బోధనను అందుకుంటుందని నేను ఆశిస్తున్నాను. మన భాష మనకు ప్రతిబింబం. ఉత్తమమైన ఆలోచనను వ్యక్తీకరించడానికి మా భాషలు చాలా పేలవంగా ఉన్నాయని మీరు ఎవరైనా అంటే, మనం మన ఉనికికే దూరమైపోతామని అంటాను. ఇంగ్లీషు ఎప్పుడైనా భారతదేశ జాతీయ భాషగా మారగలదని కలలు కనే వ్యక్తి ఉన్నారా? ఈ దేశానికి ఈ వైకల్యం ఎందుకు? ఇంగ్లీషు యువతతో మన యువత ఎలాంటి అసమాన పోటీని ఎదుర్కొంటున్నారో ఒక్క క్షణం ఆలోచించండి. కొంతమంది పూణే ప్రొఫెసర్లతో సన్నిహితంగా సంభాషించే అవకాశం నాకు కలిగింది. భారతీయ యువత, ఆంగ్ల భాష ద్వారా తాము ప్రస్తుతం సంపాదించిన జ్ఞానాన్ని పొందేందుకు కనీసం ఆరు విలువైన సంవత్సరాల జీవితాన్ని కోల్పోయారని వారు నాకు తెలిపారు. మన పాఠశాలలూ ఇంకా కళాశాలల విద్యార్థుల సంఖ్యను లెక్కించండి. ఈ దేశం ఎన్ని వేల సంవత్సరాలు నష్టపోయిందో మీరే తెలుసుకోండి. మనపై ఉన్న అభియోగం ఏమిటంటే, మనకు ఎటువంటి చొరవా లేదు. మన జీవితంలోని విలువైన కాలాన్ని ఒక విదేశీ భాషలో పాండిత్యానికి అంకితం చేస్తే మనకు ఏం చేకూరుతుంది? ఐతే, ఈ ప్రయత్నంలో కూడా మనం విఫలమయ్యాం...

గత యాభై ఏళ్ళుగా విద్యను మన స్థానిక భాషలలో మనం పొందుతున్నామని అనుకుందాం, ఈ రోజు మనకు ఏమి ఉండాలి? ఈ రోజు మనకు స్వేచ్ఛాయుత భారతదేశం వచ్చిఉండాలి, మన విద్యావంతులైన మన మనుషులు ఉండాలి, వారు తమ సొంత భూమిలో విదేశీయులలాగా కాకుండా, ఈ దేశపు గుండెతో మాట్లాడగలుగుతూ నిరుపేదల మధ్య పని చేస్తూవుండేవారు, ఇంకా గత యాభై ఏళ్ళలో వారు సంపాదించినది దేశానికి వారసత్వంగా అందించగలిగినదై ఉండేది. ఈ రోజు ఆలుమగలు కూడా తమతమ ఉత్తమ ఆలోచనలలో భాగస్వాములు కావడంలేదు. ప్రొఫెసర్ బోస్ ఇంకా ప్రొఫెసర్ రాయ్ మొదలైనవారి అద్భుతమైన పరిశోధనలను

ఆచార్య కృపాచారి గుజ్జర్లమూడి
6301985373

# మాతృభాషా మాధ్యమాన్ని పూర్తిగా తొలగించవద్దు

**భాష** అనేది ప్రజలదైనందిన వ్యవహారాల్లో, సమాజ సమాచార సంబంధాల్లో చాల ప్రధానమయింది. పాలకుల ప్రభావం పాలితులపై ఎప్పుడూ ఉంటుంది. పాలకుడే బలవంతుడైతే ఎక్కువ కాలం రాజ్యంచేస్తే వారి భాష, సంస్కృతి పాలితులపై పడుతుందన్నది జగమెరిగిన సత్యం. ఈ నేపథ్యంలో భాషలోనూ, ఆహార వినిమయ వస్తువుల్లోనూ ఆదాన ప్రదానాలు ఇబ్బడి ముబ్బడిగా ప్రవేశిస్తాయి. తెలుగు భాషకి జరిగిన ప్రమాదం అదే. మహమ్మదీయులు, పోర్చుగీసు, డచ్, ఫ్రెంచ్, ఈస్టిండియా కంపెనీల పేర వచ్చి వ్యాపారం చేసిన వాళ్లు ఆపై ఆంగ్లేయులు ఎక్కువకాలం రాజ్యం చేసినందువల్ల ఆ ప్రభావం మనపైబడి భాషా విషయికంగా పెత్తనం చేస్తుందన్న మాట కూడా స్తవముకాని వాస్తవం. ఐతే యితర భాషలవల్ల మాతృభాషకు ముప్పు ఉందన్న భయం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది.

భారతదేశంలో 99.85 శాతం121 ప్రధాన భాషలు మాట్లాడుతున్నారని ఇటీవల బిబిసిలో తేల్చి చెప్పిన లెక్క. ఇందులో కొండ భాషలు, అనాగరిక భాషలు, లిపిలేని భాషలు కేవలం జన వాగ్వ్యవహారాలకు పరిమితమైనవే ఎక్కువ. ఈ లెక్కలో చూస్తే మన తెలుగు భాష ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ, రాష్ట్రేతరాల్లోనూ బాగానే ఉందని మురిసిపోవచ్చు. అనధికార లెక్కలను బట్టి తెలుగు మాట్లాడే వాళ్లు ప్రపంచ వ్యాప్తంగా 18 కోట్ల మంది ఉన్నారంటే కొంత ఆనందంగానే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఇటీవల ఆంధ్రరాష్ట్రం మన ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుంచి ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టిందనే సరికి ధనబలం, కులబలం ఉన్న వాళ్లంతా ఒక వర్గం బలహీన బడుగు తాడిత పీడిత కులాలన్నీ మరో వైపు నిట్ట నిలువునా చీలిపోయాయి. అంతటితో ఆగకుండా కులమత వర్గదూషణలు ఆపై వంశవృక్షాలను తెగతిడుతున్నారన్నది లోకవిదితం.

వాస్తవ దృక్పదంలో ప్రభుత్వం కాని, ప్రజావ్యవస్థలో కాని కొంచెం పరికించి ఆలోచన చేయమనే అభ్యర్థనే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం. 2018 మే 10నాటి ప్రభుత్వ గణాంకాలనుబట్టి 13 జిల్లాల్లో ప్రాథ మిక, ఉన్నత పాఠశాలల్లో మొత్తం 69,91, 631 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలు 62,182 ఉంటే అధ్యాపకులు 2,86,311 మంది ఉన్నారని ప్రభుత్వ గణాంకాలు తెలియ జేస్తున్నాయి. ఇదిలా ఉంటే పాఠశాలల్లో ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలు పోటా పోటీలుగా విద్యా వ్యవస్థ నడుస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచీ ప్రవేటు విద్యా సంస్థలదే ఆధిపత్యం. అర్థ శతాబ్ది నుంచి ప్రయివేటు విద్యా సంస్థలు ఇంగ్లీషు మీడియం స్కూల్ అనే పేర బహిరంగ విద్యావ్యాపారం ప్రారంభించారన్నది వొక విదితమైన బహిరంగ రహస్యం. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలలు క్రమేపీ క్షీణదశకు చేరి వందల సంఖ్యలో మూత బడిన సందర్భాలూ లేక పోలేదు. ఈనాటి వరకూ ఇంగ్లీషు మీడియం స్కూల్లో బహిరంగ విద్యావ్యాపారం జరుగుతుంటే ఈ రాజకీయ నాయకులెవ్వరూ పల్లెత్తు మాట అనలేదు. ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి ఇంగ్లీషు మీడియం ప్రవేశపెడుతున్నామనే ప్రకటన వెలువడగానే తెలుగుభాషాభిమానం, తెలుగుభాష ఔన్నత్యం, తెలుగు భాష ఉనికి, సంస్కృతి, సంప్రదాయా లంటూ రకరకాల పదాలతో కుస్తీలు పడుతున్నారు. తెలుగు మీద ప్రేమ అభిమానం ఉంటే ఆనందమే. పైగా తెలుగు భాషను కాపాడుకోవాలన్న సత్సంకల్పం మరీ ఆనందం కలిగిస్తుంది. **నిజానికి భాషను, సంస్కృతిని కాపాడ వలసిన బాధ్యత ప్రభుత్వానికున్నట్టే సమాజానికి కూడా ఉంది. ఐతే విద్యను పరిరక్షించి భాషను పరిపుష్టం చేయవలసిన బాధ్యత పూర్తిగా ప్రభుత్వానిదే. దీనికిగాను నాణ్యమైన విద్యను అందించాలని, దేశ సుస్థిరతను కాపాడుతూ, శక్తివంతమైన జ్ఞాన సమాజంగా తీర్చి దిద్దడానికి భారతదేశం కేంద్రీకృత విద్యా విధానాన్ని 'జాతీయ నూతన విద్యా విధానం 2019' అనే పేర ఒక ముసాయిదా తయారు చేసింది.** దీనికి వివిధ రాష్ట్రాల విద్యాశాఖా మంత్రులు, ఐఎఎస్ అధికారులు, భాషా శాస్త్ర వేత్తలు, విద్యారంగంలో అనుభవమున్న ఆచార్యులు, విశ్వవిద్యాలయ ఉపకులపతులు దాదాపు 15 మంది కలిసి నూతన విద్యా విధానం ప్రతి తయారు చేశారు. దీని ముఖ్యోద్దేశం 'అందరికీ నాణ్యమైన విద్యను అందించడం ద్వారా మన దేశాన్ని సుస్థిరమైన, శక్తివంతమైన, జ్ఞాన సమాజంగా మార్చడానికి నేరుగా దోహదపడే భవిష్యత్తును ఊహించి భారత కేంద్రీకృత విద్యా వ్యవస్థను రూపొందించడానికి 2019 జాతీయ విధానం" తయారు చేసినట్టు చెప్పారు.

ఈ క్రమంలో 2026 నాటికి 3-6 సంవత్సరాల వయసున్న బాల బాలికలందరికీ నాణ్యమైన, మెరుగయిన శక్తిమంతమైన, ఆసక్తికరమైన విద్యను అందించే దిశగా ప్రణాళికలు తయారు చేయించారు. నిజానికి 5 సంవత్సరాల లోపు వయస్సున్న బాలలకు ఆసక్తికరమైన, జ్ఞాపకం ఉంచుకోదగిన, మళ్లీ మళ్లీ వల్లెవేసి చెప్పగలిగే పద్ధతిలో విద్యా ప్రణాళిక రచించడం కష్టమైన పనే. గతంలో ఆంగ్లభాషలో 0-5 సంవత్సరాల మధ్య ఉండే పిల్లలకు వివిధ రకాల పాఠ్య గ్రంథాలు, బొమ్మల పుస్తకాలు, ఆసక్తి కలిగిస్తూ ఆకర్షించే విధంగా తయారైనవి కోకొల్లలుగా లభిస్తున్నాయి. ఇక్కడే భాషనూ, భావాన్ని, విజ్ఞానాన్ని మిళితం చేసి బాల మెదడు ఎదిగే క్రమంలో వత్తిడి లేకుండా రూపొందించడం ప్రథమ కర్తవ్యంగా భావించి పుస్తకాలు తయారు చేస్తున్నారు. సున్నితమైన ఈ అంశాలకు ప్రాధాన్యతనిస్తూ భారత ప్రభుత్వం ప్రతి రాష్ట్రం కూడా విధిగా

ఆచార్య పులికొండ సుబ్బాచారి
9441364115

# భాషారాజకీయాలు : పౌరుల హక్కులు

ఒక భాష గొప్పది, ఒక భాష తక్కువది అనే విచక్షణ ఎలా వస్తుంది! ఒక భాష చాలా శక్తిమంతమైనది మిగతావి కావు; ఒక భాష చాలా మంచిది, చాలా తియ్యనిది మరొకటి వినలేము ఇలా చెబుతుంటారు. కానీ భాషాశాస్త్రం చెప్పేదేమంటే ఏ భాషకీ అంతర్గతమైన విలువ అనేది ఏదీ ఉండదు. ఏ భాష అయినా సంకేతాలతో కూడిన సమాచార వ్యవస్థ.

మనభాష మనకు తియ్యగా ఉండవచ్చు. మరొక భాషగోల గోలగా వినిపించవచ్చు. కాని ఆ భాషలో ఉన్న వాక్యాలు మనకు సమాచారం ఇవ్వగలిగితే అంటే మనం దాన్ని నేర్చుకుంటే అది మనకు కూడా తియ్యగానే వినిపిస్తుంది. ఉర్దూ తెలిసిన వారికి అందులో చాలా తియ్యని కవిత్వం ఉంది అని గ్రహిస్తారు. చాలా ఆనందిస్తారు. కాని ఉర్దూ తెలియక కేవలం తెలుగే తెలిసిన వారికి అది కాకరబీకర భాష గోలగోలగా ఉంది అంటారు. తెలియకపోతే తెలుగు కూడా అవతలి వారికి అలాగే గోలగోలగా ఉంటుంది. ఇది సమాచార వ్యవస్థ కావడం దాని లోనికి మనం కనెక్టు కాకపోడం దీనికి కారణం.

ఇక – రాజకీయంగా పాలకుల భాష గొప్ప భాష అవుతుంది. పాలితులు మాట్లాడేది తక్కువది అవుతుంది. హైదరాబాదు రాష్ట్రాన్ని పరిపాలించేటప్పుడు ఆ రాష్ట్రంలో ఉర్దూ మాట్లాడే వారి సంఖ్య అతి తక్కువ మహా అయితే అయిదు శాతం మించదు.

నిజాం రాష్ట్రంలో మరాఠీ, కన్నడం మాట్లాడేవారు కూడా ఉండేవారు. ఇక తెలుగు వారు అత్యధికంగా దాదాపు 80 శాతంగా ఉండేవారు. కాని నిజాం అన్ని స్థాయిలలోను ఉర్దూను అధికారభాషగా పెట్టాడు. పరిపాలన అంతా ఉర్దూలో నడిచేది. అది పాలక భాష. పాలితుల భాష తెలుగు. అంత ఎక్కువమంది మాట్లాడే భాషని తెలింగా అని ఎక్కిరించేవారు. ఇక మారు మూల గ్రామాలలో ఉండే పటేళ్ళు కరణాలు కూడా ఉర్దూ నేర్చుకునే వారు. పైరవీకారులు కూడా ఉర్దూ నేర్చుకునేవారు. తాసీలు ఆఫీసుకు వచ్చి కాని సూబాకి వచ్చి కాని ఈ తెలుగు వారే షేర్వానీ వేసుకొని, పైన రూమీ టోపీ పెట్టుకొని ఉర్దూ మాట్లాడేవారు. దానితోనే పైరవీలు ఆఫీసు పనులు చేసుకునేవారు ఉర్దూ రాని మామూలు జనం దగ్గర నుండి పనులు చేసిపెట్టినందుకు డబ్బులు వసూలు చేసుకునే వారు. పైరవీకారులు వారి ఉర్దూ పరిజ్ఞానంతోనే బతికే వారు. ఆనాటి పాలక భాషలో మాట్లాడడం, వారిలా వేషం వేసుకోవడం గొప్ప. అప్పుడు ఉర్దూ భాష గొప్పది, తెలుగు ఎక్కిరింతకు గురయ్యే భాష. ఇదే పరిస్థితి అటు సర్కారు జిల్లాలలో ఉండేది. కాకపోతే అక్కడ ఇంగ్లీషు గొప్ప భాష తెలుగు తక్కువ భాష. అదే విధంగా ఒకప్పుడు సంస్కృతం గొప్ప భాష, తెలుగు దేశభాషలు తక్కువవి.

ప్రతి భాషలో పండితులకీ సంస్కృతం అవసరం గొప్ప భాష. ఇక రాజులు తెలుగు పోషించినప్పుడు తెలుగు గొప్ప భాష, మిగతా గిరిజన భాషలు తక్కువవి. నిజానికి ఆ గిరిజన భాషలలో కూడా దీర్ఘ ఇతిహాసాలు ఉండేవి మంచి సాహిత్యం ఉండేది. కాని పాలక భాష తెలుగు అది గొప్పది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా కేంద్రంలో హిందీ పూర్తి స్థాయి అధికార భాష కాలేకపోయింది.

అలాగే చాలా రాష్ట్రాలు వారి వారి భాషలను అధికార భాష లుగా చేసుకున్నారు. కాని అమలులో కొంతమంది గట్టిగా అమలు చేసుకున్నారు. పాలక భాషగా మార్చుకున్నారు. కొన్ని రాష్ట్రాలు ఇంగ్లీషు మీదనే ఆధారపడి కొనసాగిస్తున్నాయి. ఇంగ్లీషు అన్ని రాష్ట్రాల మధ్య ఒక లింక్ లాంగ్వేజ్‌గా పనికి వచ్చింది. దీనివల్ల పరిపాలన సులభం అయింది. హిందీని లింక్ లాంగ్వేజ్ గా చాలా రాష్ట్రాలు అంగీకరించలేదు. ఇంగ్లీషు అప్పటికే వారికి కొంత తెలిసి ఉండడంవల్ల ఆయా రాష్ట్రాలలో తెల్ల వారి కారణంగా అప్పటికే ఇంగ్లీషును పాలక భాషగా ఆ రాష్ట్రాలు వాడుకున్నాయి. ఈ రకంగా ఇంగ్లీషు చారిత్రక కొనసాగింపుగా పాలక భాషగా కుదురుకుంది. ఈ కారణంగా అది పాలక భాషగా తిరిగి అధికార గౌరవాన్ని పొందింది. దీనిద్వారానే ఇంగ్లీషు గొప్పభాష అయింది. భారతీయభాషలు తక్కువవి అయ్యాయి. తమిళ నాడు వంటి రాష్ట్రాలు వారి భాషని క్రమంగా అధిక స్థాయిలో పరిపాలన భాషగా అమలు చేసుకున్నారు. ఇంగ్లీషు వినియోగం అవసరం మేరకే ఉంచుకున్నారు. తమిళం భాషనే అత్య ధిక గౌరవప్రదంగా ఆత్మాభిమాన చిహ్నంగా పెంచుకున్నారు. ప్రతిదీ తమిళంలోనే ఉండాలి అనే పరిస్థితికి వారు వచ్చారు. చివరికి హైకోర్టు తీర్పులు కూడా తమిళంలోనే ఉండాలి అనే దశలో ఉన్నారు వారు. ఇంత కాకపోయినా కర్ణాటకలో కూడా భాషాభిమానం ఎక్కువే. వారికి కూడా పరిపాలన భాష కన్నడం పూర్తి స్థాయికి తెచ్చుకున్నారు. ఇంగ్లీ షుని అవసరం మేరకే వాడతారు. చదువు ఇంగ్లీషు మీడియం కన్నా కన్నడ మీడియమే అక్కడ ఎక్కువ. పీజీ కోర్సులు కూడా కన్నడం లో అందించే స్థాయిలో వారు ఉన్నారు. సిలబస్ కమిటీలలో వారి యూని వర్సిటీ లకు నేను వెళ్ళాను. మేము సిలబస్ ని ఇంగ్లీషులో సూచించినా వారు తిరిగి కన్నడంలో రాసుకుంటారు. కోర్సులను కన్నడంలో అందిస్తున్నారు. ఇంగ్లీషు మీడియం ఉన్నా అది కావాలనుకున్నవారు అటు వెళతారు.

ఇదే క్రమంలో అటు ఆంధ్రరాష్ట్రం, ఇటు హైదరాబాదు రాష్ట్రం కలిసి పెద్దమనుషుల ఒప్పందం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా అవతరించింది. దీనికి అధికారభాష హోదా నామమాత్రంగానే మిగిలింది అని పైన చెప్పుకున్నాము. పరి పాలన భాష ఉర్దూనుండి ఇంగ్లీషుకు మారింది. కాని చాలా పాలన పరమైన పదాలు ఉర్దూవి కొనసాగాయి.

తహసీల్దారు, గిర్దావరు, మోతాదు, పటేల్, పట్వారీ మాలీ పటేల్, మాల్, పేష్కస్, జమాబందీ, నాకాబందీ, కమామీషు ఇలా

బి. హనుమారెడ్డి
94402 88080

# తెలుగు మాధ్యమం రద్దు న్యాయమా?

భారతదేశం పలురాష్ట్రాల కూటమి. కొన్ని రాష్ట్రాలు అతి పెద్దవిగా వుండి ప్రపంచంలో కొన్ని కొన్ని దేశాలంత పెద్దవి. అన్ని దేశాలకు మాతృభాషలున్నట్లే మనదేశంలోనూ అన్నిరాష్ట్రాలకు వారివారి మాతృభాషలున్నై. కనుకనేనేమో మనకు జాతీయ భాషలేదు. కేవలం అధికార భాష మాత్రమే ఉన్నది.

రాష్ట్రాల విభజనకు మొదట్లో ఎన్నివాదనలొచ్చినా ప్రాధమిక సూత్రం భాషే అయింది. భాషాసూత్రంతో ఏర్పడ్డ మొదటి రాష్ట్రం ఆంధ్రరాష్ట్రమే-1953. తెలుగుల ప్రత్యేక రాష్ట్రం వెనుక నాల్గైదు దశాబ్దాల ఉద్యమం ఉన్నది. తెలుగు రాష్ట్రం ఏర్పడ్డాకనే స్టేట్స్ రీఆర్గనైజేషన్ చట్టం- 1956 వచ్చింది. ఇది అనాలోచనతో చేసిన చర్యకాదు. కనుక శతాబ్దంపై కాలంగా భాషారాష్ట్రాల వాదనలొచ్చి, మాతృభాషల ప్రాముఖ్యతను ప్రజలు, పాలకులు అంగీకరించారు. ఇపుడు తెలుగు గ్లోబల్ భాషైంది. తెలుగువాడు లేని దేశంలేదు. తెలుగు సంఘాలు, పండుగలు, దేవాలయాలు చాలదేశాల్లో వచ్చాయి. కనుక మాతృభాషకు ప్రాముఖ్యం లేదనలేము.

తెలుగువారు నైపుణ్యాలు కలవారని ప్రపంచమెరిగిన సత్యం. వారిలో ఎక్కువ శాతం మాతృభాష తెలుగు మాధ్యమంలో చదివిన వారే. ఇతర దేశాలలో తెలుగువారు ఉద్యోగ అవసరాలకు ఆంగ్లం వాడుకున్నా, మిగతా అన్ని దైనందిన కార్యక్రమాలకు మాతృభాష తెలుగునే వాడుతున్నారు.

ఐక్యరాజ్య సమితివారు కూడ బంగ్లాదేశ్‌లో మాతృభాషా ఉద్యమంలో ఉద్యమకారుల మరణాల తర్వాత దాదాపు 40 సంవత్సరాలు ప్రపంచంలోని మాతృభాషల సమస్యలను అధ్యయనం చేసి, మాతృభాషలు అంతరించిపోతున్న పరిస్థితిని నిర్ధారించి అది ప్రమాదమని అంతరించిపోకుండా రక్షించుకొమ్మని ప్రపంచ ప్రజలకు పిలుపునిచ్చి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21వతేదీని మాతృభాషా దినోత్సవం జరుపుకొనుమన్నది. మనం జరుపుకొంటున్నాం. ప్రపంచంలోని ప్రతి దేశం వారి మాతృభాషను గౌరవించి, టెక్నాలజీని, మెడికల్ మరియు ఇంజనీరింగ్ విద్యను మాతృభాష లలోనే నిర్వహించుకుంటున్నారు. చైనాలో మాండరిన్ భాషలోనే వైద్యవిద్య సాగుతున్నది.

మనదేశంలో గాంధీ, రవీంద్రనాథ ఠాగూరు, నేటి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి మొదలైన పెద్దలు, మాతృభాషలకు పెద్దపీట వేశారు. భాషా శాస్త్రజ్ఞులు, విశ్వవిద్యాలయ మండళ్ళు వగైరా పెద్దలందరు మాతృభాషలకు తట్టు తగలనీయలేదు. సుప్రీంకోర్టువారుకూడ తీర్పుల నకళ్ళను మాతృభాషలలో కోరినవారికి అలానే ఇవ్వమన్నారు.

రాజ్యాంగంలోనూ, న్యాయపరమైన సి.పి.సి. లోనూ, సి.ఆర్.పి.సి.లో కూడ ప్రాంతీయ మాతృభాషల వాడకాన్ని చట్టబద్ధం చేశారు. తెలుగు అకాడమీ, సాహిత్య అకాడమీలు అందుకే పెట్టారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1966 సం.లో అధికారభాషా చట్టాన్ని చేసుకొని దానిప్రకారం 1974లో G.O.M.S.485ను ఇచ్చి, జిల్లాల వారీగా మాతృభాషలను ఉపయోగించు హక్కులను ప్రభుత్వం ఇచ్చింది. భాషాసూత్రం ప్రకారమే ఆంధ్రరాష్ట్రం పొరుగు తెలుగు ప్రాంతమైన తెలంగాణాను కలుపుకొని, విశాలంగా ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడింది.

విద్యార్థిదశలో ఒక అంశం మాతృభాష అధ్యయనంతో విశాలాంధ్రగా ఏర్పడ్డదికాదు. అదే ఒక అంశంగా ఆంగ్లం ఉండవచ్చు కదా! అదనంగా నేర్చుకునే వాళ్ళకోసం అదనపు అవకాశాలు కల్పించవచ్చు. ఇంటిభాష, పరిసరాలభాష ఒకటిగా, బడిభాష వేరొకటిగా ఉన్నందున బాలవయసునుండి విద్యార్థికి అగమ్యగోచరమే. స్వీపర్ ఆంటీ, డ్రైవర్ అంకుల్ భాషలు ఆరోగ్యకరం కావు.

ప్రభుత్వాలు శక్తిహీనమైనందున విద్య ప్రైవేటురంగంలోకి పోతుంటే, తమకు బరువు తగ్గిపోయిందని వారు సంతోషించారు. ప్రైవేటువారు విద్యను వ్యాపారం చేసుకొని లాభాలకు భాషను ఒక పరికరంగా వాడుకున్నారు. వారి అవసరాల తీర్చునట్లుగానే పరిక్షల వ్యవస్థ, ఉద్యోగ వ్యవస్థ ప్రభుత్వమే రూపొందించింది. వ్యాపారులే రాజకీయ నాయకులు, పరిపాలకులై విద్యావిధానాన్ని తప్పుదోవ పట్టించారు.

ప్రభుత్వం ఇపుడు పేదవారికి ఇంగ్లీషు రావాలనే సాకుతో మాతృభాష తెలుగును చంపే నిర్ణయం చేసింది. అసలు సమస్య పేదరికం కనుక పేదరికాన్ని పోగొట్టే చర్యలు లేదా పేదలకు అదనపు ఆర్థిక సహాయం చేసి పేదలు ఇంగ్లీషులో చదువుకుని ఎదిగే అవకాశాలు కల్పించవచ్చు. ఇందుకు మాతృభాషను చంపపనిలేదు. రాజకీయం, ఓట్ల లభ్యతకొరకు మాతృభాషను త్యాగం చేయరాదు. భాషపై అవగాహనగాని, అధ్యయనంగాని లేని కొద్దిమంది పామరజనం పాదయాత్రలో కోరిన కోరికలకోసం మాతృభాషకు విఘాతం కల్పించుట దురన్యాయం. ఐక్యరాజ్యసమితి పామరజన సమూహంకాదు కదా! యునెస్కో అధ్యయనం ప్రకారం ఏభాషైనా 30/40 సంవత్సరాలు వాడుకలో లేకపోతే చచ్చిపోతుంది. నేటినుండి పుట్టిన ప్రతిబిడ్డకు ఇంగ్లీషు మాధ్యమమే ఉంటే 30/40 సంవత్సరాలకు తెలుగు బ్రతికుండదు.

ఏతావాతా మనరాష్ట్రంలో ఒక అంశం తెలుగు అధ్యయనంతో భారతదేశంలో తెలుగులో విద్యనభ్యసించే అవకాశం లేకుండాపోయి, కొన్ని దశాబ్దాలకు తెలుగు మౌఖిక భాషగా మాత్రమే మిగిలి మరణించే ప్రమాదం ఉన్నది. అంతేకాక ఇంగ్లీషు మాధ్యమం ఎస్.సి. వారికోసం పెట్టారు అనేభావన, ప్రజల్లోకి వచ్చినందువల్ల రాష్ట్రంలో కులభాషల వాతావరణం వచ్చింది. ఇది సమాజానికి ప్రమాదం.

కృపాకర్ పొనుగోటి
9948311667

# భాషా మాధ్యమం ఎంపిక స్వేచ్ఛ ఉండాలి

భాషకీ - నిరుద్యోగితకీ, భాషకీ - ఆర్థిక మాంద్యానికి, భాషకీ - పెట్టుబడికీ, భాషకీ - అభివృద్ధికీ, భాషకీ - నాగరికత కీ,భాషకీ - ఆధునికతకీ, భాషకీ - కులానికీ,భాషకీ - వలస వాదానికి సంబంధముంది. భాషకీ - రాజకీయాలకీ సంబంధముంది.

బహుజన సమాజం మొత్తం, ఇంగ్లీష్ విద్యా సమాజంగా మారినా, అంతర్జాతీయ, జాతీయ ప్రభుత్వ సంస్థల్లోకి, ప్రైవేట్ ఐటీ, సాంకేతిక, శాస్త్ర సంస్థల్లోకీ ఇక్కడుండే ఆధిపత్య కులాలు బహుజనుల ను ప్రవేశించనీయవు. డెబ్భై ఏళ్ళ డేటా విశ్లేషించి, ఇప్పటి దాకా మన దామాషా రేటెంతో సరిచూడండి. కొత్తగా మన సమాజం మొత్తం ఇంగ్లీష్ చదువులకు అలవాటు పడినా, మనల్ని వ్యాపార, పారిశ్రామిక యాజమాన్యా ల్లోకి, శిష్ట అధికార వర్గం లోకీ ఆధిపత్య కులవ్యవస్థ రానివ్వదు. ఒక వేళ రానిచ్చినా, డెబ్భై ఏళ్ళ నుండి ఉన్న గొఱ్ఱతోక బెత్తెడే నిష్పత్తిలోనే ఉంచుతుందన్న ప్రమాదాన్ని గుర్తుంచుకోవాలి.

ఇంగ్లీష్ చదువులు వద్దని నేను అనడం లేదు. ఖచ్చితంగా కావాల్సిందే. సాపేక్షికంగా ఇంగ్లీష్, అవకాశాల్లో ముందంజలో ఉంచగలిగే పురోగామిక భాషే. ఐతే,ఇంగ్లీషు ఎంత అభివృద్ధి చెందిన మాధ్యమం అయినప్పటికీ, అన్ని సమస్యలనీ కేవలం మాధ్యమం పరిష్కరించలేదు. ఇంగ్లీషు మాధ్యమం ద్వారా కొందరు బహుజనులు తమ పేదరిక నిర్మూలన చేసుకున్నవారు ఉన్నారు. కానీ, కుల నిర్మూలనా వాదాన్ని ప్రాక్టీస్ చేసినవారు బహు తక్కువే. మీడియంను వారి భౌతిక సౌకర్యాల కల్పనలకు వాడుకున్నంతగా ఉద్యమ నిమగ్నతకు వెచ్చించ లేకపోయారనేది చేదు నిజం.అంతేగాదు, **నాటి వలస దోపిడీ ఇంగ్లీష్ ప్రభుత్వం గానీ, వలసానంతర మనువాద ప్రభుత్వాలు గానీ, వాటి పరిపాలనా అవసరాలకే భాషా మాధ్యమా లను, ముఖ్యంగా ఇంగ్లీషును వాడుకున్నాయే తప్పా, పౌరులకు బోధించి, అందుబాటులోకి తెచ్చి, నిత్యవ్యవహారాల భావ ప్రసారం పౌరుల మధ్య జరిగే భాషగా ఇంగ్లీషును మార్చలేకపోయాయి. ఇలా మార్చడం వాటి ఉద్దేశ్యం కూడా కాదు. కేవలం ఒక అధికార రహస్య సాంకేతిక భాషగానే నేటికీ ఇంగ్లీషును కొనసాగిస్తున్నాయి.** మేము ఇంగ్లీషు మాట్లాడే యజమానుల మైతే, మా పనివాళ్ళు కూడా ఇంగ్లీషే మాట్లాడాలి కదా అనే కాడికి తెచ్చారిప్పుడు అనిపిస్తుంది.

**మాధ్యమం వేరు. విజ్ఞానం వేరు. ఒక మనిషి విజ్ఞాని అయ్యుం డడం, మాధ్యమం కంటే గొప్ప సంగతి. ప్రాథమిక మైనది.** భావ ప్రసార మనేది రెండవది. మొట్టమొదటిసారిగా విజ్ఞాన శాస్త్రాల వర్గీకరణ అరిస్టాటిల్ ఇంగ్లీష్ లో జరపలేదు. గ్రీకులో చేశాడు.ప్రాచీన రాజనీతి భావాలను, శాస్త్రాన్ని హేతువాద పునాదులమీద ప్లేటో, అరిస్టాటిల్ గ్రీకులో అభివృద్ధి చేశారు. ఇంగ్లీష్‌లో కాదు. ప్రాచీన రాజనీతి పితామహుడు అరిస్టాటిల్ ఆంగ్లేయుడు కాదు.గ్రీకు దేశస్తుడు. బుద్ధుడు, కౌటిల్యుడు, మనువు భారతీయులు. అలాగే ఆధునిక రాజనీతి పితామహుడు మాకియవెల్లి ఆంగ్లేయుడు కాదు. ఇటాలియన్. హెగెల్, కార్ల్‌మార్క్సులు జర్మన్లు. ఫ్రాయిడ్ ఆస్ట్రియన్. ఆధునిక భావాజాల విప్లవాలు జరిగింది, గొప్ప భావాజాలాలు పుట్టింది, వృద్ధి చెందిందీ ఇంగ్లీష్ దేశాల్లో కాదు. ఫ్రాన్స్‌లో, రష్యాలో, చైనాలో. జర్మనీ, వియత్నాం, జపాన్ తదితర దేశాల్లో. బుద్ధుడు, జీసస్, ముహమ్మద్ ప్రవక్త, మహావీరుడు, సంత్ రవిదాస్, గురునానక్‌లు పుట్టింది ఇంగ్లీష్ దేశాల్లో కాదు. ఆధునిక వైజ్ఞానిక, సామాజిక శాస్త్రా లను వృద్ధి చేసిన చాలా మంది శాస్త్రవేత్తలు, తత్వవేత్తలు ఆంగ్లేతరులే.

పాతికేళ్లలో కంప్యూటర్ సైన్సు ఇంజనీరింగ్ చదివిన బహు జనుల్లో ఉద్యోగాలు పొందిన వారికంటే, నిరుద్యోగుల సంఖ్యే చాలా ఎక్కువ అని అందరికీ తెలుసు. ఇదే మాదిరిగా, రేపు ఇంగ్లీషు వచ్చిన బహుజన నిరుద్యోగ సైన్యం తయారౌతుంది. తేడా అంతే!

బ్రాహ్మణ మతాన్ని పెంచి పోషిస్తున్నది, శూద్ర అగ్ర కులాల పాలకులు, నాయకులే. కొత్తగా వారిని బహుజనులు నమ్మాల్సిన అవసరం ఏమొచ్చింది? తెలుగు భాషని, మత భాషతో, మృత భాషతో కలిపి జటిలం చేశారనేది చాలా నిజం. ఐతే, ఈ వ్యతిరేకతతో నమ్మి నానబోసుకుంటే, పుచ్చి బుర్రలయ్యే మరో భాషని నమ్ము దామా? దగ్గరౌదామా? అదే పరిష్కారమా? ఆలోచించాలి.

అసలు మన సమస్య ఇంగ్లీష్ రాకపోవడం అనే భాషా సమస్య అనేది కొంత వరకే నిజం. బహుజనుల అసలు సమస్య రాజకీయ, సామాజిక నిర్ణయాత్మక శక్తులుగా తయారు కావడమనే సమస్య. ఇది సామాజిక, రాజకీయ లక్ష్యం, కార్యాచరణకు సమాయత్తం కావడానికి సంబంధించిన సమస్య.

**కొద్ది మంది షెడ్యూల్డు కులాలకు చెందిన వారు, ఆదివాసులు, సంచార జాతుల వారు అగ్ర కులాల ప్రభుత్వాలలో హోం మంత్రి అయితేనో, చీఫ్ సెక్రటరీ అయితేనో, వారి పార్టీలకు అధ్యక్షులైతేనో పరిష్కారమయ్యేంత చిన్న సమస్య కాదు, బహుజనులది. భాష మనకి భావ ప్రసార సాధనం మాత్రమే. మనం, మన ఇంటి భాషను ప్రేమిస్తాము. ఇతర భాషలను గౌరవిస్తాము.కానీ, ఏ (వలస) భాషకీ బానిసలము కాబోము అనే చైతన్యాన్ని ప్రదర్శించ వలసిన సందర్భం ఇది.**

రహ్మానుద్దీన్ షేక్
94930 35658

# తెలుగు భాషా మాధ్యమ అవసరం, సాంకేతిక దృక్పథం

అత్తారింటికిదారేది సినిమాలో ఈ సన్నివేశం గుర్తుందా? అత్తని మర్చిపోమన్న నాన్నకి గౌతమ్ నందా ఒక కథ చెప్తాడు.

మనింటికి కష్టమొచ్చినట్టే ఒక ఊరికి వరదొచ్చింది. ఆ వరదలో ఉన్న ఒకతను భార్యాబిడ్డలను తీసుకొని అవతలి ఒడ్డుకి ఈదడం మొదలుపెట్టాడు. మధ్యలో బరువు మొయ్యలేక భార్యను వదిలేసాడు. తర్వాత కూతురిని, ఆఖరుకి భుజాల మీద ఉన్న కొడుకుని కూడా వదిలేసాడు. వాడు మాత్రం ఒడ్డుకు చేరాడు. కానీ వాడు బతికినన్నాళ్ళూ వదిలేసిన ముగ్గురినీ తలుచుకుంటూ ఏడుస్తూ బతికాడు. అదృష్టమో దురదృష్టమో మనం అత్తని ఇంకా మోస్తూనే ఉన్నాం. తనని వద్దనుకొని వదిలేసి ఒడ్డుకెళ్ళి ఏడుద్దామా? లేదంటే కొంచెం కష్టమైనాసరే మోసుకుంటూ తీసికెళ్ళి జీవితాంతం నవ్వుతూ బతుకుదామా!??

దీన్నే తెలుగు భాషకీ చెప్పుకోవచ్చు!

మన తెలుగు రాష్ట్రాలకు ఆంగ్ల వరద వచ్చింది. మన అదృష్టం కొద్దీ ఇంకా తెలుగును మనం మోస్తున్నాం. కష్టమనుకొని తెలుగును వదిలేసి మనమూ ఆ ఆంగ్ల వరదలో కొట్టుకుపోదామా? తర్వాత ఒడ్డుకి చేరి (జీవిత చరమాంకంలో) ఏమీ చెయ్యలేకపోయామని తలుచుకుంటూ బాధపడదామా?

కొంచెం కష్టమైనా తెలుగును మోసుకుంటూ, నిలబెట్టుకుంటూ ఈ వరదని దాటించి జీవితాంతం తృప్తిగా బతుకుదామా?

పదో తరగతి ఆపైన తెలుగు చదివి, ఒక స్థాయిలో వ్యవహరించగలిగిన వాళ్ళం మనదే అటువంటి చివరితరం. ఇప్పుడు కాకపోతే, ఇకముందు మనం చేయగలిగినది ఏమీ ఉండదు!

పై వాక్యాలు ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఆంగ్లభాషా మాధ్యమ నిర్ణయం గురించి వీవెన్ గారి ప్రతిక్రియ నుండి తీసుకున్నవి.

**మన రోజువారీ జీవనమూ, అందులో భాగమైన ప్రతీదీ, మన సొంత భాషలో ఆశించడం మన హక్కు. అలా మనకి లభించనప్పుడు, ఆ దిశగా కృషి చేయడం, పోరాడటం మన బాధ్యత.**

ఈ విషయాన్ని గుర్తించనంత వరకు మనం ఏదో కోల్పోతున్నాం. ఏం కోల్పోతున్నామన్నది ఇదమిత్థంగా ఈనాడు చెప్పుకోలేకపోవచ్చు గానీ జరగాల్సిన ఉపద్రవం అయ్యాక చేతులు కాలాక ఆకులు పట్టుకున్న జాతిగా ఆంధ్రప్రదేశ్ ప్రజ చరిత్రలో మిగిలిపోనుంది.

తెలుగు రాష్ట్రాల్లో వ్యవహారాలు తెలుగులో జరిగితే, ఇక్కడ వస్తు సేవలు తెలుగులో లభ్యమయితే ఉద్యోగావకాశాలన్నీ తెలుగులోనే ఉంటయ్!

ఈ విషయాన్ని ప్రభుత్వం ఎంత త్వరగా అర్థం చేసుకొని అమలు పరిస్తే అంత మంచిది.

**ఏ దేశ ప్రభుత్వమైనా, తమ జనాభాను ఒక వనరుగా భావించి, ఆ మానవ వనరులను సద్వినియోగ పరిచే విధంగా ఉపాధి కల్పించి, తద్వారా వచ్చే ప్రత్యక్ష-పరోక్ష ఆదాయం ద్వారా ప్రభుత్వం నడపాలి.**

ప్రభుత్వమే అందరికీ ఉద్యోగాలివ్వాలనో, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగం చెయ్యాలనో పై వాక్య ఉద్దేశ్యం కానే కాదు.

ప్రస్తుత, సమీప భవిష్యత్తు, దూర భవిష్యత్తు - ఈ మూడింటినీ అంచనా వేసుకుంటూ, ఉపాధి-అభివృద్ధి-ఆదాయం మూడింటినీ లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వం తగు పరిశ్రమలను నెలకొల్పాలి, లేదా ప్రయివేట్ సంస్థలు అలాంటి పరిశ్రమలు నెలకొల్పి ప్రజలకు ఉపాధి అందించేలా చర్యలు తీసుకోవాలి.

**ఇందుకోసం ప్రభుత్వం ప్రజలను వారి సహజ వాతావరణం, కట్టుబాట్లు, భాషా, నడవడికల నుండి ఎంత తక్కువ వేరు చేస్తే అంత మెరుగైన పాలనను అందించినట్టు. అభివృద్ధి పేరుతో ప్రజల భాష-ఆచారాలను సమూలంగా మార్చాలని ప్రయత్నించిన ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదు. చరిత్రపుటల్లో అలాంటి సందర్భాలు బోలెడు.**

**ప్రస్తుతం ఆంగ్ల మాధ్యమ విద్యార్థులనో, ఆంగ్ల భాషా ప్రావీణ్యమున్న విద్యార్థులనో ఉద్యోగ అభ్యర్థులకు తప్పనిసరి అర్హతగా ప్రతిపాదిస్తున్న సంస్థలు, ఆ ఆంగ్ల భాషా అర్హతను అభ్యర్థుల ఎంపికకు ఒక సాకుగా తీసుకొని అనర్హత ఉన్న అభ్యర్థులను వడపోస్తున్నాయి. ఒకవేళ అందరూ ఆంగ్ల మాధ్యమం చదువుకున్న విద్యార్థులే వస్తే, వడపోతకు మరొక కొలమానాన్ని ఆ ఉద్యోగాన్నిచ్చే సంస్థలు ప్రవేశపెడతాయే తప్ప ఆంగ్ల మాధ్యమంలో చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు ఇచ్చేయవు.**

**అలాగే ప్రస్తుతమున్న ఉద్యోగాలలో పనిప్రదేశంలో ఆంగ్ల భాషా ప్రావీణ్యం అవసరమున్న ఉద్యోగాలు చాలా తక్కువే. ఆ ఉద్యోగాలలో కూడా ఉద్యోగుల అవసరాన్ని అనుసరించి కన్నడ, తమిళం, తెలుగులలో చాలా పని ప్రదేశాలలో సమాచార వినియోగం మొదలయి, కేవలం విదేశీ సంస్థలు లేదా విదేశీ ప్రతినిధులకు**

కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Ammanudi+December+2019](http://kinige.com/book/Ammanudi+December+2019)

* * *